తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం
08 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :



ఆర్టిఐ చట్టం సమాచారంతో దారికిపోయిన డి ఎల్ పి ఓ

## జనంసాక్షి కథనంతో ఉలికిపాటు ..

# విలేకరిపై దాడికి యత్నం!

- 'డీఎల్‌పీఓ కారుకు మర్రిగూడ మండల నిధులా?' అని ప్రశ్నించినందుకే దూషణలా?
- వార్త ప్రచురితమైన రోజే జర్నలిస్టుపై బెదిరింపుల ఆరోపణలు
- ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది పోయి దాడికి యత్నించారంటూ ఆరోపణ




మర్రిగూడ, అక్టోబర్ 7 (జనంసాక్షి)

ప్రభుత్వ నిధుల వినియోగంపై ప్రశ్నిస్తూ "డీఎల్‌పీఓ కారుకు మర్రిగూడ మండల నిధులా?" అనే శీర్షికతో జనం సాక్షి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో బుధవారం జనం సాక్షి విలేకరిపై దూషణలు, బెదిరింపులు, దాడికి యత్నం జరిగిందన్న ఆరోపణలు మర్రిగూడలో కలకలం రేపాయి. డీఎల్‌పీఓ శంకర్ నాయక్‌కు సంబంధించినదిగా పేర్కొంటున్న వాహనానికి ఇంధన ఖర్చులపై జనం సాక్షి కథనం పలు ప్రశ్నలు లేవనెత్తింది. టీఎస్ 07 ఎఫ్ వై 2226 వాహనానికి 366 లీటర్ల పెట్రోల్‌కు రూ.39,528 ఖర్చు చేసినట్లు ఉన్న రికార్డులపై వాహనం ఎవరిది? మండల నిధుల నుంచి ఇంధన వ్యయం ఎందుకు? వాహనం ఎక్కడ తిరిగింది? లాగ్‌బుక్‌లో ప్రయాణ వివరాలు ఉన్నాయా? అనే ప్రశ్నలను కథనం ద్వారా ప్రజల ముందుంచింది.

ఈ నేపథ్యంలో మర్రిగూడకు చెందిన కొల్లుపల్లి యాదయ్య అనే వ్యక్తి జనం సాక్షి విలేకరిని బూతులతో దూషిస్తూ బహిరంగంగా అవమానించారని, దాడికి కూడా యత్నించారని అంతేకాకుండా "కారు శంకర్ నాయక్‌ది కాదు అని వార్త రాయకుంటే అంతు చూస్తాం" అంటూ బెదిరించినట్లు తెలిపారు.

### ప్రశ్నలకు సమాధానం ఇదేనా?

జనం సాక్షి ప్రచురించిన కథనంలోని అంశాలు వాస్తవమా? కాదా? అన్నది అధికారిక రికార్డులు తేల్చాల్సిన విషయం. వాహనం డీఎల్‌పీఓకు సంబంధం లేదంటే దానికి సంబంధించిన యాజమాన్య పత్రాలు, వాహన వినియోగ అనుమతి, లాగ్‌బుక్, ఇంధన బిల్లులు, చెల్లింపు వివరాలను బయటపెడితే విషయం స్పష్టమవుతుంది.

అయితే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి బదులు జర్నలిస్టుపై దూషణలు, అవమానాలు, బెదిరింపులు, దాడికి ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

### జర్నలిస్టుపై దాడి అంటే ప్రశ్నించే హక్కుపై దాడే!

ప్రజా ధనం ఎలా ఖర్చవుతోంది? ప్రభుత్వ వాహనం ఎక్కడ తిరుగుతోంది? ఇంధన బిల్లులకు ఆధారాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు అడగడం జర్నలిస్టు విధి. వార్తల్లో తప్పులు ఉంటే సంబంధిత అధికారులు వాస్తవాలను వెల్లడించవచ్చు. ఖండన ఇవ్వవచ్చు. అవసరమైతే చట్టపరమైన మార్గాలను ఆశ్రయించవచ్చు.

కానీ వార్త రాసినందుకు జర్నలిస్టును బూతులతో దూషించడం, బహిరంగంగా అవమానించడం, బెదిరించడం లేదా దాడికి ప్రయత్నించడం జరిగితే అది ఒక్క విలేకరిపై వార్త లోపలి పేజీలో



## పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(జనంసాక్షి):

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని స్టార్ బ్యాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి కుటుంబంలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సకాలం లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మి, వైస్ చైర్మన్ ఎండీ.షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో సర్పంచుల పాత్రపై

# స్పష్టత ఎప్పుడు?

- సెకండ్ ఫేజ్‌లోనైనా గ్రామ ప్రథమ పౌరుడికి చోటివ్వాలని డిమాండ్
- జనంసాక్షి ప్రత్యేక గ్రౌండ్ రిపోర్ట్

వార్త లోపలి పేజీలో



## నవంబర్ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్లు

# పూర్తి చేయాలి

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 07 (జనంసాక్షి):

పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు మిగతా 2లో

# చేప ముక్కల కోసం యువకుల ఘర్షణ.!

- బహిరంగంగానే మద్యం విక్రయాలు..?
- అర్ధరాత్రి వరకు మద్యం సేవిస్తున్న యువకులు
- కాలనీలో ఇబ్బందులు పడుతున్న మహిళలు, కుటుంబాలు



ఖమ్మం రూరల్, అక్టోబర్ 7 (జనంసాక్షి)

ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెండో డివిజన్ రాజీవ్ స్వగృహ ప్రాంతంలో మద్యం విక్రయాలు,రోడ్ల మీద బహిరంగంగా మద్యం సేవిస్తూ యువకులు చేస్తున్న హంగామాతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. తాజాగా మద్యం మత్తులో చేప ముక్కల విషయంలో కొందరు యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో కాలనీలో ఆందోళన నెలకొందని స్థానికులు తెలిపారు. రాత్రివేళల్లో మద్యం సేవించి గొడవలకు దిగుతుండటంతో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు.

### 'చేప'ముక్కలతో మొదలై ఘర్షణగా మారిన వైనం

స్థానికుల కథనం ప్రకారం.. మద్యం సేవించిన కొందరు యువకులు చేప ముక్కల విషయంలో పరస్పరం వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనతో కాలనీ వాసులు భయం దోళనకు గురయ్యారు.రాత్రి వేళల్లో మద్యం, గంజాయి సేవిస్తూ యువకులు హంగామా చేయడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.

### అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలా?

రాజీవ్ స్వగృహ ప్రాంతంలో బహిరంగంగానే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమయం దాటినా విక్రయాలు కొనసాగుతున్నాయని, మద్యం సేవించేందుకు పలువురు అక్కడికి చేరుకోవడంతో రాత్రివేళల్లో పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినా మిగతా 2లో

# నవంబర్ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను తనిఖీ చేసి, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకొని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. గోడల నిర్మాణం, స్లాబ్ పనులు, పైకప్పు పనులు, తుదిదశ నిర్మాణ పనుల పురోగతిని ఒక్కొక్క ఇంటి వారీగా పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ, నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా అధికారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. నవంబర్ నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలతో పాటు అంతర్గత రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాల పనులను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారులకు నిర్మాణ సమయంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, నిర్మాణం పూర్తయిన దశల ఆధారంగా ప్రతి సోమవారం బిల్లుల మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇల్లు పూర్తయిన అనంతరం మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వ ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు.

ఇప్పటికే అర్హత పొందిన లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

అవసరమైన నిర్మాణ సామగ్రి, సాంకేతిక సహాయం, బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుండా రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి, లబ్ధిదారులు తమ సొంతింటిలో గృహప్రవేశం చేసేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని, లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో కూడిన శాశ్వత గృహాలను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు.

కలెక్టర్ తనిఖీ సందర్భంగా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాలలో నరేంద్ర మోడీ



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్07 (జనంసాక్షి):** నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమం నరేంద్ర మోడీ అవిశ్రాంతంగా 140 కోట్ల ప్రజల జీవితాలలో వెలుగులు నింపటం కోసం ప్రతిరోజు గత 25 సంవత్సరాలుగా నిరంతరం రోజుకి 18 గంటలు పని చేస్తున్నారు. ఆ మహనీయుడు సేవలో ఇదేవిధంగా కొనసాగాలని ఆ భగవంతుడు నరేంద్ర మోడీకి మరింత శక్తిని ప్రసాదించాలని ఈరోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ హుజూర్నగర్ ఎమ్మెల్యే శాసనపూడి సైదిరెడ్డి ఆకాంక్షించారు అదేవిధంగా 2047 లోపు ఈ దేశాన్ని విశ్వ గురువుగా ఇక భారత్ గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా మోడీజీ పనిచేస్తున్నారు అని ఆయన అన్నారు ఈరోజు ప్రపంచం అంతా మోడీకి నాయకత్వాన్ని చూసి గర్విస్తుంది. ఈరోజు భారత్ యొక్క పాస్పోర్ట్ విలువ ప్రపంచంలో పెరిగింది అంటే దానికి కారణం నరేంద్ర మోడీ పరిపాలన మచ్చ లేని నాయకుడిగా ఒక్క అవినీతి మరక కూడా లేకుండా 25 సంవత్సరాలుగా పరిపాలన చేసినటువంటి గొప్ప నాయకుడు నరేంద్ర మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు ఒక్క కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ విజయ్ చందర్ రెడ్డి, జీవీకే మనోహర్ రంగా కిరణ్ గారు జిల్లా ప్రధాన కార్యదర్శులు భోగి కృష్ణ జాటోత్ వెంకన్న నాయక్ బిక్షపతి జజ్జూరి మోహన కృష్ణ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో కమలనాథుల 'సేవా జ్యోతి యాత్ర'





**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 07( జనంసాక్షి )** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా, పాలనా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలో భారతీయ జనతా పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. బుధవారం నగరంలో కమలనాథులు చేపట్టిన 'సేవా జ్యోతి యాత్ర', 'వికసిత్ భారత్ సంకల్ప సభ' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. గాంధీచౌక్ సమీపంలోని బోస్ సెంటర్ రోడ్డులో ఉన్న ఉమాభవన్ వేదికగా ప్రారంభమైన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పోటెత్తడంతో ఖమ్మం నగరం కాషాయమయంగా మారింది. కార్యకర్తలు చేత కాషాయ జెండాలు పూని ర్యాలీగా కదలడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ సందడిగా, ఒక పండుగ వాతావరణాన్ని తలపించాయి.

మోదీ పాతికేళ్ల నిరంతర ప్రజాసేవను కీర్తిస్తూ నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర ఆద్యంతం కోలాహలంగా సాగింది. నాయకులు సేవా జ్యోతులు, పూర్ణకుంభ కలశాలను చేతబూని యాత్రలో అగ్రభాగాన నిలవగా.. వేలాది మంది కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కదం తొక్కారు. ముఖ్యంగా ఈ ర్యాలీలో మహిళల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన మహిళలు వీధుల్లో కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ యాత్రకు మరింత వన్నె తెచ్చారు. దారిపొడవునా కాషాయ పతాకాలు రెపరెపలాడుతుండగా, మహిళల ప్రదర్శనలను తిలకించేందుకు నగరవాసులు రహదారులకిరువైపులా ఆసక్తిగా బారులు తీరారు.

యాత్ర అనంతరం ఉమాభవన్‌లో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో బీజేపీ నేతలు ప్రధాని పాలనా దక్షతను వేనోళ్ల కొనియాడారు. ఈ సభలో బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి పరిపాలనా పగ్గాలు చేపట్టిన మోదీ.. అటునుంచి దేశ ప్రధానిగా ఎదిగి.. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా దేశ ప్రజల అఖండ మద్దతు కూడగట్టుకున్న తీరును నాయకులు సభికులకు వివరించారు.

సరిగ్గా ఈనాటికి (2026 అక్టోబర్ 7) ప్రభుత్వాధినేతగా మోదీ 25 వసంతాలు పూర్తి చేసుకోవడం దేశ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టమని నేతలు అభివర్ణించారు. ఇదే సందర్భంగా కేంద్ర మంత్రివర్గం ప్రధాని నాయకత్వాన్ని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానం చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. సెప్టెంబర్ 17న ప్రారంభమైన సేవా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగానే ఈ యాత్రను నిర్వహించినట్లు తెలిపారు. ప్రధాని మోదీ కన్న కల అయిన 2047 నాటి 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' సాధన దిశగా ప్రతి పౌరుడూ, కార్యకర్తా సమిష్టి సంకల్పంతో అడుగులు వేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసమే ప్రధాని పాతికేళ్ల ప్రస్థానానికి ప్రధాన బలమని స్పష్టం చేస్తూ.. ఈ చారిత్రక ఘట్టాన్ని ఖమ్మం నగరంలో కమలనాథులు చిరస్మరణీయంగా ముగించారు.

## చేప ముక్కల కోసం యువకుల ఘర్షణ.!



సమస్య పరిష్కారం కాలేదని పేర్కొంటున్నారు.

**అధికారులు నిఘా పెట్టాలి..**

చేప ముక్కల కోసం వచ్చే పలువురు కాలనీలో బహిరంగంగా మద్యం విక్రయాలు, గంజాయి సేవిస్తూ మత్తులో హంగామా చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రశాంతంగా జీవించేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు

### శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు : సీఐ సట్ల రాజు





**భద్రాచలం అక్టోబరు 07 (జనంసాక్షి)** భద్రాచలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సట్ల రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా మెరుగైన సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై నిఘా పెంచి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పోలీసు చర్యలు చేపడతామని సీఐ సట్ల రాజు తెలిపారు.



## పాతర్లపాడులో ఘనంగా ఆహార పోషక మహోత్సవాలు

### పిల్లలకు స్వచ్ఛమైన, సమతుల్య పోషకాహారం అందించాలి

### ఆరోగ్యవంతమైన బాల్యం.. బలమైన భవిష్యత్తుకు పునాది

### పోషకాహారం భవిష్యత్ తరాల బలానికి పెట్టుబడి: సర్పంచ్ జడల సుష్మ రమేష్

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 7 (జనంసాక్షి)** తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామం లో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఆహార పోషక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జడల సుష్మ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ చిన్నారులు, తల్లులు, గర్భిణీ స్త్రీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందించాల్సిన సమతుల్య ఆహారం, పోషక విలువలు, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించడంతో పాటు, తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. "పిల్లలకు ఇచ్చే పోషకాహారం వారి ఆరోగ్యానికి మాత్రమే కాదు.. భవిష్యత్ తరాల బలానికి పెట్టుబడి" అని సర్పంచ్ జడల సుష్మ రమేష్ పేర్కొన్నారు. "ఆరోగ్యవంతమైన బాల్యం.. బలమైన భవిష్యత్తుకు పునాది. ప్రతి చిన్నారికి స్వచ్ఛమైన, సమతుల్యమైన పోషకాహారం అందించడం మనందరి బాధ్యత" అని ఆమె అన్నారు. గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా సాగిందని అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. చిన్నారులు, తల్లి దండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ టీ. నాగమణి, ఆయా, గర్భిణీ స్త్రీలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీ కీలక సూత్రదారి జ్ఞానేష్ కుమార్ దిగిపోవాలి

**రామన్నపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):** ఓటు చోరీ కీలక సూత్రధారి జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో డివైఎఫ్ఐ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని సంచలనంగా మారిన ఓట్ చోరీ అనే అంశం మీద దేశమే అట్టుడికి పోతున్న సందర్భంలో వివిధ రూపాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన ఎన్నికల కమిషన్ సిఈసి జ్ఞానేష్ కుమార్ ఒంటెద్దు పోకడతోటి దేశంలోనే మూడున్నర కోట్ల ఓట్లను చోరీ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహేళన చేసే విధంగా చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది జ్ఞానేష్ కుమార్ మాత్రమే దేశంలో గాని రాష్ట్రంలో గాని పొట్ట తిప్పల కోసం చిన్న చిన్న దొంగతనాలు చేసినటువంటి సామాన్య ప్రజలను తీవ్ర స్థాయిలో ఇబ్బందుల గురి చేసి జైలులో నిర్బంధిస్తున్న తరుణంలో మరి జ్ఞానేశ్వర్ బయట ఎందుకు ఉండాలో కేంద్ర ప్రభుత్వం కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అని అన్నారు. ఓట్ చోరీ చేసి ప్రశాంతంగా రూములలో సేధా తీరుతున్న జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే బర్తరఫ్ చేసి జైల్లో పెట్టాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేశారు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ యొక్క అండదండలతోటి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అదేవిధంగా బెంగాల్ రాష్ట్రంలో 90 లక్షల ఓట్లను తీసేసి నకిలి ప్రభుత్వం ఏర్పాటు అయింది అని కూడా అన్నారు. నకిలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అన్ని విధాలుగా సహకరించిన జ్ఞానేష్ కుమార్ ని తక్షణమే భర్తరఫ్ చేసే వరకు మా పోరాటాలు ఉదృతంగా ఉంటాయని కేంద్ర ప్రభుత్వాన్ని జ్ఞానేశ్ కుమార్‌ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రామన్నపేట మండల అధ్యక్ష కార్యదర్శులు మెట్టు శ్రవణ్ కుమార్ శానకొండ రామచంద్రం మండల కమిటీ సభ్యులు మునికుంట్ల లెనిన్, నాగటి రవి, జేల్లాల మల్లేశం, ఆవనగంటి మహేష్, గట్టు మహేష్, మచ్చ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



### నీటి పైపులైన్ రిపేరు కొరకు రోడ్డును తోమారు, పూర్తయిన పూడ్చకుండా వదిలేశారు

**చండూరు,అక్టోబర్ 7 (జనంసాక్షి)** మిషన్ భగీరథ నీటి పైపు రిపేరు కోసం ప్రధాన రహదారీని తవ్వి, అలాగే వదిలేయడం వల్ల స్థానికులకు,వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. వాహనదారులు, పాఠశాల విద్యార్థులు ప్రమాద బారిన పడక ముందే ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. చండూరు మున్సిపాలిటీ పరిధి గుండ్రపల్లి రోడ్డు హైస్కూల్ కు వెళ్లే దారిలో ఇటీవల మిషన్ భగీరథ నీటి పైపులైన్ రిపేరు కొరకు రోడ్డును తవ్వడం జరిగింది. అయితే, రిపేరు పూర్తయిన తర్వాత గుంతను పూడ్చకుండా రోడ్డును అలాగే వదిలేశారు. దీనివల్ల ఇక్కడ నుంచి ప్రయాణించే వాహనదారులు, నడిచే ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది, సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించి, పూర్వ స్థితికి తీసుకురావాలని కోరుతున్నారు.

# ఖైతాపురం గ్రామానికి దక్కిన అరుదైన గౌరవం

**'క్షయ వ్యాధి లేని ఉత్తమ గ్రామం'గా ఎంపిక!**

**చౌటుప్పల్ అక్టోబర్ 7(జనంసాక్షి)** సమాజంలో ఆరోగ్యకరమైన మార్పుకు, సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది మండలంలోని ఖైతాపురం గ్రామం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టిబీ ముక్త్ భారత్' (క్షయ రహిత భారత్) లక్ష్యాలలో భాగంగా, ఖైతాపురం గ్రామం క్షయ వ్యాధి లేని ఉత్తమ గ్రామం'గా ఎంపికై అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయం చుట్టుపక్కల గ్రామాలకు మాత్రమే కాకుండా, యావత్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోంది.

**సమిష్టి కృషి - అంకితభావం**

ఖైతాపురం గ్రామం ఈ ఘనత సాధించడం వెనుక గ్రామ పంచాయితీ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల నిరంతర కృషి ఉంది. గ్రామంలోని ప్రతి ఒక్కరికీ క్షయ వ్యాధి (టిబి) పట్ల పూర్తి అవగాహన కల్పించడంలో మరియు బాధితులను గుర్తించి తగిన వైద్యం అందించడంలో వీరు కీలక పాత్ర పోషించారు.



**నేడు (అక్టోబర్ 8న) అవార్డు ప్రధానం**

ఈ అద్భుతమైన మైలురాయిని పురస్కరించుకుని, 08 అక్టోబర్ 2026న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లోని 'ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్'(ఐడిఓసి) నందు ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఖైతాపురం గ్రామ సర్పంచ్, కార్యదర్శి,ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అధికారుల చేతుల మీదుగా 'ఉత్తమ గ్రామ అవార్డు' సర్టిఫికెట్ అందజేసి, ఘనంగా సన్మానించడం జరుగుతుంది

# ఇందిరమ్మ ఇళ్లలో సర్పంచుల పాత్రపై స్పష్టత ఎప్పుడు?

**సెకండ్ ఫేజ్‌లోనైనా గ్రామ ప్రథమ పౌరుడికి చోటివ్వాలని డిమాండ్**

**జనంసాక్షి ప్రత్యేక గ్రౌండ్ రిపోర్ట్**

**మర్రిగూడ, అక్టోబర్ 7 (జనంసాక్షి)** పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామస్థాయిలో కొత్త చర్చకు దారితీసింది. రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసిన నేపథ్యంలో.. కొత్తగా ఎన్నికైన సర్పంచులకు పథకం అమలులో ఎలాంటి బాధ్యత ఇస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గ్రామపంచాయతీ ఎన్నికలు జరగని సమయంలో ఏర్పాటు చేసిన కమిటీలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని పలువురు సర్పంచులు చెబుతున్నారు. ప్రజలు ఓటుతో ఎన్నుకున్న గ్రామ ప్రథమ పౌరుడికి అర్హుల ఎంపిక, పరిశీలన, నిర్మాణ పర్యవేక్షణలో పాత్ర లేకపోతే స్థానిక జవాబుదారీతనం ఎలా ఉంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. "ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. గ్రామ అభివృద్ధికి మేమే బాధ్యత వహించాలి. పేదల ఇళ్ల విషయంలో మాత్రం మా మాటకు విలువ లేకపోతే ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలి?" అని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే గ్రామసభకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. అర్హుల జాబితాలను గ్రామసభ లేదా వార్డు సభ ముందు ఉంచడం, అభ్యంతరాలు స్వీకరించడం, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో తుది నిర్ణయం తీసుకోవడం ద్వారా రాజకీయ ఆరోపణలకు తావు లేకుండా చేయవచ్చని అభిప్రాయపడుతున్నారు. రెండో దశలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ప్రభుత్వం ఏ స్థాయిలో బాధ్యత ఇస్తుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. పాత కమిటీలనే కొనసాగిస్తారా? లేక ఎన్నికైన గ్రామపంచాయతీ వ్యవస్థను భాగస్వామిగా చేస్తారా? అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఇందిరమ్మ ఇల్లు ఏ పార్టీకి చెందిన పథకం కాదని, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రయోజనం అందాలని సర్పంచులు కోరుతున్నారు. అధికారులు, గ్రామపంచాయతీ, గ్రామసభ, కమిటీల సమన్వయంతో పథకం అమలు చేస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని చెబుతున్నారు. సర్పంచుల డిమాండ్: సెకండ్ ఫేజ్‌లో అధికారిక పాత్ర కల్పించాలి.. గ్రామసభకు ప్రాధాన్యం ఇవ్వాలి.. పేదల ఇళ్ల ఎంపికలో పారదర్శకతను నిర్ధారించాలి.




# జనంసాక్షి కథనంతో ఉలికిపాటు .. విలేకరిపై దాడికి యత్నం!

జరిగిన ఘటనగా కాకుండా సమాజం తరఫున ప్రశ్నించే గొంతును అణచివేసే ప్రయత్నంగా చూడాల్సిన అవసరం ఉంది.

**వార్తను ఆపగలరా? ప్రశ్నలను ఆపగలరా?**

ప్రభుత్వ నిధుల వినియోగంపై ప్రశ్నలు లేవనెత్తిన ప్రతిసారి జర్నలిస్టులపై ఒత్తిళ్లు వస్తే ప్రజా సమస్యలు ఎవరు వెలుగులోకి తీసుకురావాలనే ప్రశ్న తలెత్తుతోంది.

**వాహనం ఎవరిదో రికార్డులు చెప్పాలి.**

ఇంధన బిల్లులు ఎందుకు చెల్లించారో అధికారులు చెప్పాలి.
లాగ్‌బుక్‌లో ఏం నమోదైందో వెల్లడించాలి.వార్త తప్పైతే ఆధారాలతో ఖండించాలి.అంతే తప్ప జర్నలిస్టుపై దాడి చేయడం లేదా బెదిరించడం సమాధానం కాదు.

**పోలీసుల విచారణకు డిమాండ్**

జర్నలిస్టుపై దూషణలు, బెదిరింపులు, దాడికి యత్నం జరిగిందన్న ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని జర్నలిస్టు వర్గాలు కోరుతున్నాయి. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న ఆడియో?వీడియో ఆధారాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అదే సమయంలో "డీఎల్‌పీఓ కారుకు మర్రిగూడ మండల నిధులా?" అనే ప్రశ్నకు సంబంధించి వాహన యాజమాన్య వివరాలు, లాగ్‌బుక్, ఇంధన బిల్లులు, అనుమతులు, చెల్లింపు రికార్డులను సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.ప్రశ్నించడం నేరం కాదు..వార్త రాయడం నేరం కాదు..ప్రజా ధనానికి లెక్క అడగడం జర్నలిస్టు బాధ్యత.ర్నలిస్టు గొంతును దూషణలతో కాదు.. వాస్తవాలతో సమాధానం చెప్పాలి!

# సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

**అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి కే భవ్య**



**పెన్ పహాడ్ 07 అక్టోబర్ (జనంసాక్షి)** సూర్యపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యదర్శి కే. భవ్య, మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వ్యవసాయ న్యాయ, రైతు సమాజ ప్రయోజనం కోసం వ్యవసాయ చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కే. భవ్య మాట్లాడుతూ, రైతులు వారి హక్కులు, వ్యవసాయ చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాలలోని రైతులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సేవ సహాయం పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూ టీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, కే ప్రియదర్శిని ,న్యాయవాదులు, గ్రామ సర్పంచ్ రవి, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఎస్సై బాలు నాయక్, ఏ.ఈ.ఓ వెంకటరెడ్డి, పి ఎల్ వి లు ఒగ్గు సోమన్న, ఒగ్గు ప్రవీణ్, మీసాల నాగయ్య, గజ్జల ధర్మారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఆశపెట్టి మోసం చేసే సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త:సీఐ రవి

**వలిగొండ, అక్టోబర్ 7 (జనంసాక్షి)** సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ రవి అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, పోలీస్ అధికారులు, కస్టమర్ కేర్ సిబ్బంది పేరుతో ఫోన్ చేసి ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు అడిగినా ఇవ్వకూడదన్నారు. తెలియని లింకులు, క్యూఆర్ కోడ్‌లు, యాప్‌లను ఉపయోగించేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. లాటరీ, బహుమతి, ఉద్యోగం, లోన్, పెట్టుబడుల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన మెసేజ్‌లకు స్పందించి డబ్బులు పంపవద్దని హెచ్చరించారు.అలాగే ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అవతలి వ్యక్తి వివరాలను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే డబ్బులు పంపాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వారు భయపడకుండా వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని సీఐ రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**డిజిటల్ అరెస్ట్ అనే విధానమే లేదని ప్రజలు గుర్తించాలి**

**జిల్లా ఎస్పీ కె.నరసింహ**




**సూర్యాపేట (జనంసాక్షి):** సైబర్ మోసాల నివారణ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న పోలీస్ ప్రజా భరోసా సైబర్ జాగ్రత్త్ దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సైబర్ మోసాల నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ సంబంధిత అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డిజిటల్ అవగాహన, సైబర్ భద్రతపై జ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారిని కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సైబర్ వారియర్ గా మారి సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనుమానిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా సందేశాలు, అనుమానాస్పద లింకులను అనుసరించవద్దని సూచించారు. తక్కువ పెట్టుబడితో భారీ లాభాలు వస్తాయనే ఆఫర్లను నమ్మవద్దన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దని పేర్కొన్నారు. అనంతరంజిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ జిల్లాలో సైబర్ నేరాల నివారణ కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి బుధవారం నిర్వహించే పోలీస్ ప్రజాభరోసా, సైబర్ జాగ్రత్త్ దివాస్ కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం సూచనల మేరకు జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రజల అత్యాశ, అవగాహన లోపాన్ని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని తెలిపారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, మెయిల్ తదితర మార్గాల ద్వారా ప్రజలను సంప్రదించి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, పెట్టుబడులు, టాస్క్‌లు, వర్చువల్ అకౌంట్ల పేరుతో నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లలో డబ్బులు జమ చేయించి, అకౌంట్‌లో భారీ మొత్తాలు ఉన్నట్లుగా చూపించి, వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు మరింత డబ్బు చెల్లించాలని కోరుతూ మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సీబీఐ, సీఐడీ, ఐబీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల పేర్లు ఉపయోగిస్తూ, పోలీస్ అధికారులు లేదా ఇతర అధికారుల ఫొటోలు, నకిలీ గుర్తింపు కార్డులు చూపిస్తూ వీడియో కాల్స్ చేసి మీపై కేసు నమోదైంది, మీ ఫోన్‌లో అక్రమ కార్యకలాపాలు గుర్తించాం, మీరు డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారు అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనే విధానం లేదని ప్రజలు స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ఏ ప్రభుత్వ లేదా పోలీస్ అధికారి ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా బెదిరించి డబ్బులు చెల్లించాలని కోరితే నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ అనూష, డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, టెక్నికల్ టీమ్ ఎస్ఐ సాయిరామ్, ఆర్ఎస్ఐ సాయిరామ్, సురేష్, చివ్వెంల ఎస్ఐ మహేష్, జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మోటకొండూరులో రెండు రోడ్డు ప్రమాదాలు

**బైకులు ఢీకొని నలుగురికి గాయాలు**

**తీవ్రంగా నిరాశపరిచిన 108.. ఆలస్యంగా అంబులెన్స్**

**వాహనాల సంఖ్య పెంచాలని స్థానికుల డిమాండ్**



**మోటకొండూరు అక్టోబర్ 7 (జనంసాక్షి):** మోటకొండూరు మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం లక్ష్మీ వైన్స్ ఆవరణ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కి సమాచారం ఇచ్చినా, అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరు కోవడం తీవ్ర ఆలస్యమైంది. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ క్షతగాత్రులు రోడ్డుపైనే నరకయాతన అనుభవించారు. గోల్డెన్ అవర్‌లో వైద్యం అందకపోతే ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని, అంబులెన్సుల కొరతతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన 108 సేవలు ఇలా జాప్యం కావడం దారుణమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి అంబులెన్సుల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అనంతరం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

**కాటేపల్లి వద్ద కారు, బొలెరో వాహనాల ఢీ తప్పిన పెను ప్రమాదం**

మరోవైపు.. కాటేపల్లి వంతెన వద్ద కారు, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు ముందుభాగం ధ్వంసం కాగా, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారును ఆత్మకూరుకు చెందిన మజ్జిగ నరేష్, బొలెరోను సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎండీ సమద్ ఖురేషీ నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి పౌరుని రక్షణ భద్రత పోలీసుల బాధ్యత

- విద్యార్థులు సైబర్ వారియర్లుగా మారి సమాజాన్ని చైతన్యపరచాలి
- అవగాహన లోపం, అత్యాశతోనే సైబర్ మోసాలు : జిల్లా ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లాలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దినోత్సవం లో భాగంగా సూర్యాపేట పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సైబర్ మోసాల నివారణ, సైబర్ సెక్యూరిటీపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె.నరసింహ ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రతి పౌరుడి భద్రత, రక్షణే పోలీసుల ముఖ్య విధి అని అన్నారు. పౌరుల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో జరిగే ఆర్థిక నేరాలు నేరాలు, దొంగతనాల్లో ప్రస్తుతం సైబర్ మోసాలే అత్యధికంగా 80 శాతం నమోదవుతున్నాయని అన్నారు. ప్రజల అత్యాశ, అవగాహన లోపాన్ని ఆయుధంగా చేసుకున్న సైబర్ మోసగాళ్ళు సుదూర ప్రాంతాల్లో ఉండి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఏ బ్యాంకు అధికారులు గానీ, దర్యాప్తు, పోలీసు సంస్థలు గానీ ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు అడగరని, డిజిటల్ అరెస్ట్ చేస్తామని చెప్పే మాటలను అస్సలు నమ్మవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టేటప్పుడు లేదా అపరిచిత వ్యక్తులతో లావాదేవీలు జరిపేటప్పుడు ఒక్క నిమిషం ఆగి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అవగాహన పెంచుకుని వారియర్లుగా మారాలని, తమ తల్లిదండ్రులను, సమాజాన్ని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాలల్లో ర్యాగింగ్ అనేది విష సంస్కృతి అని, తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కళాశాల నుండి టర్మినేట్ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యంతో, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలని, తల్లిదండ్రుల కలలను, గురువుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ వో డాక్టర్ వెంకటరమణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, అజయ్ కుమార్, షీ టీమ్ ఎస్సై నీలిమ, పోలీసు కళాబృందం, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దవూర మండలంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

### స్పెషల్ ఆఫీసర్ సతీష్



**పెద్దవూర: అక్టోబర్ 7 (జనంసాక్షి ):** కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దవూర మండల స్పెషల్ ఆఫీసర్ వి.సతీష్ బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉట్లపల్లి , పులిచర్ల, కేకే తండా, పర్వేదుల, పాల్తి తండా, నిమనాయక్ తండా గ్రామాలను సందర్శించి, 'చేయూత' పెన్షన్ కోసం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక యాప్‌లో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేయూత పెన్షన్ అందేలా పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేసి అర్హులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుమర్తిలో వైభవంగా చీరల పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**మాడుగులపల్లి అక్టోబర్ 7 ( జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామంలో ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది ఈ కార్యక్రమానికి నల్గొండ శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు, అర్హులైన లబ్ధిదారులకు తన చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలనే లక్ష్యంతోనే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చామని పేర్కొన్నారు ప్రతి ఒక్క అర్హురాలైన మహిళకు ప్రభుత్వ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సమైక్య ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి మండలంలో వితంతు,దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

## గాదెపాడులో పోషణ కార్యక్రమానికి హాజరైన అధికారులు

**జనంసాక్షి,అక్టోబర్07,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో చేయూత పథకం కింద వితంతు,దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి వినోద్‌కుమార్ బుధవారం విచారణ నిర్వహించారు.మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్‌తో కలిసి పింఛన్లకు సంబంధించిన వివరాలను పరిశీలించి,అర్హతకు సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాలు, గర్భిణులకు శ్రీమంతం,చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమంలో డీపీఓ వినోద్‌కుమార్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలతో డీపీఓ మాట్లాడారు.ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తయారు చేసి ప్రదర్శించిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను డీపీఓ పరిశీలించారు.ఆయా ఆహార పదార్థాల్లోని పోషక విలువలు,చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి అంగన్‌వాడీ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతతో సేవలందించాలని, చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీఓ సూచించారు. చిన్నారుల సంరక్షణలో తల్లిదండ్రులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్‌కుమార్,సీడీపీఓ కే ఉమా, అధికారులు,తల్లిదండ్రులు,పిల్లలు,తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతో ఆరోగ్య సమాజం

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 7(జనంసాక్షి):** ఎదులాపురం మున్సిపాలిటీ నాయుడుపేట 3వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు 1, 2, 3లలో బుధవారం పోషణ మహా కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ కొమరగిరి సత్యవతి, సీడీపీవో కమలప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషక విలువలున్న ఆహారం అందించాలని సూచించారు. గుడ్లు, పాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేయాలన్నారు. జంక్‌ఫుడ్, అధిక ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలని, చిన్నారులకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా ఇతర పిల్లలతో కలసి ఆడుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాలతీ కుమారి, మానవ హక్కుల జిల్లా అధ్యక్షురాలు తోటకూరి అంజమ్మ, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, సరోజిని, సరితాబాయి, ఆయా శైలజ, ఆశా కార్యకర్తలు సుజాత, పుల్లమ్మ, పీఎస్/హెచ్ఎం సుధారాణి, ఆర్పీలు వెంకటలక్ష్మి, స్వరూప, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# ఆగమ్మ దశదిన కర్మలో ఎమ్మెల్సీ



**సంస్థాన్ నారాయణపురం. అక్టోబర్ 7( జనంసాక్షి):** సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్ లో దంటిక ఆగమ్మ దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ఆగమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, సిపిఐ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే గాలయ్య, ఈద మల్లయ్య, పార్టీ కార్యకర్తలు, ఆగమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సతీష్‌రెడ్డి, మహిళా ఎస్ఐ లైలా పాల్గొని అంతర్జాల మోసాలు, నకిలీ సామాజిక మాధ్యమ ఖాతాలు, బ్యాంకింగ్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, మోసపూరిత సందేశాలు, సైబర్ వేధింపులపై అవగాహన కల్పించారు. ఒకసారి ఉపయోగించే గోప్య సంకేతం, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య, కార్డు భద్రతా సంఖ్య, ఏటీఎం, బ్యాంకు వివరాలు, సంకేతపదాలను ఇతరులకు తెలియజేయవద్దని సూచించారు. గుర్తుతెలియని అనుసంధానాలు, ఫోన్‌కాల్స్, సందేశాలు, ఈమెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, మురళీధర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు షరీఫ్, సాయి, సరస్వతి పాల్గొన్నారు.

# అప్రమత్తంగా డ్రైవింగ్‌తోనే ప్రమాదాలకు చెక్

- అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం
- వాహనదారుల అప్రమత్తతే రోడ్డు ప్రమాదాల నివారణకు సరైన ఆయుధం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్..

**చిట్యాల , అక్టోబర్ 07 (జనంసాక్షి)** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, సర్వేజన ఫౌండేషన్ సహకారంతో చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద ఎన్‌హెచ్-65 జాతీయ రహదారిపై ప్రయాణించే భారీ వాహనాలు, ట్రక్కుల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు లోపాలు ఉన్న వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతలో డ్రైవర్ల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు అత్యంత కీలకమని అన్నారు. భారీ వాహనాల డ్రైవర్లు ఎక్కువ దూరం, ఎక్కువ సమయం ప్రయాణించాల్సి ఉండటంతో కంటి అలసట, చూపు మందగించడం, నిద్రలేమి, శారీరక అలసట వంటి కారణాలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. అందువల్ల డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, కంటి చూపును క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో డిఫెన్సివ్ డ్రైవింగ్ ఎంతో ముఖ్యమని ఎస్పీ తెలిపారు. రోడ్డుపై ఇతర వాహనదారులు తప్పులు చేసే అవకాశం ఉందనే విషయాన్ని ముందుగానే ఊహించి, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన విధంగా వాహనం వేగాన్ని తగ్గించడం, సురక్షిత దూరం పాటించడం, అవసరమైన సమయంలో బ్రేకులు వేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ తన వాహనాన్ని మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న వాహనాలు, పాదచారులు, రోడ్డు పరిస్థితులు, మలుపులు, రహదారి పక్కన ఉన్న ప్రమాదకర ప్రాంతాలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని అన్నారు. డ్రైవర్లు అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి ప్రమాదకర చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హైవేలపై భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువగా అలసట అనిపించినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది ప్రాణాలు కోల్పోయారని, వారిలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు హెల్మెట్ ధరించకపోవడం కారణంగా 32 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనంలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని ఎస్పీ సూచించారు. హెల్మెట్ కేవలం ట్రాఫిక్ నిబంధన కోసం కాకుండా ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారుల బాధ్యతతో పాటు రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరి అప్రమత్తత అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. “రోడ్డుపై మనం చేసే చిన్న తప్పిదం మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవచ్చు. అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, అప్రమత్తం గా వాహనాలు నడపాలి” అని సూచించారు. ఎన్‌హెచ్-65 వంటి జాతీయ రహదారులపై నిరంతరం ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్ల కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. డ్రైవర్ల కంటి చూపు, ఆరోగ్యం సరిగా ఉండటం రోడ్డు భద్రతకు ఎంతో అవసరమని, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ కే. శివరాం రెడ్డి, ఎస్‌బీ సీఐ నాగరాజు, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, విష్ణు, డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య, స్థానిక సర్పంచ్ బొంత చంద్రా రెడ్డి,సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్, డాక్టర్ ప్రదీప్, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, లారీ అసోసియేషన్ సభ్యులు,భారీ వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.











# ట్రస్మా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆచార్య దేవోభవ అవార్డులు ప్రధానోత్సవము

## ముఖ్య అతిధిగా విప్, ఎం ఎల్ ఏ బీర్ల ఐలయ్య

**యాదగిరిగుట్ట అక్టోబర్ 7 ( జనంసాక్షి)** తెలంగాణ రికగ్నైజర్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ లో ప్రవేటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు ఆచార్యదేవోభవ 2026 అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాధుల మధుసూదన్ హాజరై అనంతరం వారి చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాతో సత్కరించి మేమంటూ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మరియు ప్రైవేటు టీచర్ రక్షణ చట్టాన్ని అమలు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, రాష్ట్ర సలదరుడు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి,జిల్లా గౌరవ అధ్యక్షులు బండిరాజుల శంకర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ , కోశాధికారి మరియన్న, మాజీ జిల్లా అధ్యక్షులు అచ్చయ గౌడ్, దణాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సభ్యులు రామిరెడ్డి,జిల్లా నాయకులు ఉపేందర్ రెడ్డి, వివిధ పాఠశాల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కర పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ అంకిత్

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కర ఏర్పాట్లు పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాల నోడల్ అధికారిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి
- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 07 (జనంసాక్షి)**
వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద చేపట్టిన పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులచే ప్రారంభమైన పనులతో పాటు మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ, సీపీఓ కార్యాలయం నుంచి పుష్కరాల కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఎస్పీ రోహిత్ రాజు, సీపీఓ సునీతలను ఆదేశించారు.

గోదావరి పుష్కరాల పనుల పర్యవేక్షణకు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పుష్కరాలకు మరో పది నెలల సమయం మాత్రమే ఉన్నందున పనుల పురోగతిని నోడల్ అధికారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని, వారానికొకసారి పనులను సమీక్షించి పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

భద్రాచలం పుష్కర క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు . ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య, పోలీస్ తదితర శాఖలు తమ పరిధిలోని పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. దుమ్ముగూడెం, పర్ణశాల, మోతేపట్టి నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లకు సంబంధించి టైర్-1, టైర్-2, టైర్-3 కింద చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు.

పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్, అప్రోచ్ రోడ్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు తదితర మౌలిక వసతులను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఘాట్లకు చేరుకునే రహదారులు, ఘాట్ల మరమ్మతు పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 2015లో నిర్వహించిన గోదావరి పుష్కరాలకు సంబంధించిన వివరాలను సేకరించి సమగ్ర నివేదికతో పాటు సుమారు 30 పేజీల ప్రత్యేక బుక్‌లెట్‌ను రూపొందించాలని సీపీఓ సునీతను కలెక్టర్ ఆదేశించారు.

పుష్కర ఘాట్ ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సూచనలు సులభంగా అందేలా డీడబ్ల్యూఓ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను తరలించేందుకు గతంలో వినియోగించిన 30 ఎకరాల డంపింగ్ స్థలాన్ని అవసరమైతే తిరిగి వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణలో అన్ని శాఖలు తమ బాధ్యతలను స్పష్టంగా గుర్తించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్, భక్తుల రద్దీని ముందస్తు ప్రణాళికతో సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను సంబంధిత శాఖలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరారు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై చేపట్టే మరమ్మతులు, రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుగానే స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పాల్వంచ?దమ్మపేట, తల్లాడ?భద్రాచలం, బయ్యారం, దుమ్ముగూడెం తదితర ప్రధాన మార్గాల్లో రహదారుల పరిస్థితిని ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, హోల్డింగ్ ప్రాంతాలను సిద్ధం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. హోల్డింగ్ ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్ వంటి ప్రాథమిక సదుపాయాలు ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు మార్గదర్శకంగా ట్రాఫిక్ సైన్‌బోర్డులు, ఎల్ఈడీ డిస్‌ప్లేలు, దిశానిర్దేశక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తుల ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, అన్ని శాఖలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చివరి నిమిషంలో పనుల ఒత్తిడి లేకుండా నిర్ణీత గడువుకు ముందుగానే పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. శ్రీరామనవమి, ముక్కోటి వంటి ప్రధాన కార్యక్రమాల కారణంగా అధికార యంత్రాంగంపై అదనపు పనిభారం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, డీఆర్ఓ పద్మావతి, డీపీఓ అనూష, డీటీఓ భూషిత్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : కలెక్టర్ అంకిత్

- ఇసుక వాహనాల రాకపోకలకు సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించాలి : ఎస్పీ రోహిత్ రాజు
- హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవాలి- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 07( జనంసాక్షి):**
జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో ఇసుక రవాణా, వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని, చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు.



బూర్గంపాడు పరిధిలో గొల్లగూడెం, సారపాక బ్రిడ్జి, తాళ్లగూడెం, ఉప్పాక, పినపాక పట్టినగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణా వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి ప్రత్యామ్నాయ పార్కింగ్, హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చెర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి,కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య కూటమి గెలిస్తేనే ఆర్టీసీ నీ పరిరక్షించుకొగలం

**○సింగరేణి కాలనీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మందా నరసింహారావు**

**○డిపో వద్ద ఆర్టీసీ ఎన్నికల విస్తృత ప్రచారం నిర్వహించిన సింగరేణి సీఐటీయూ జిల్లా నాయకులు..**

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 07 (జనంసాక్షి):** ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్ డబ్ల్యు ఎఫ్, టి యం యు, టి డబ్ల్యూ యు, ఐ ఎన్ టి యు సి కూటమినీ గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నాయకులు ఈరోజు కొత్తగూడెం బస్ డిపో నందు విస్తృత ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా మంద నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ ఐక్య కూటమికే ఓట్లు వేస్తే ఆర్టీసీ సంస్థ కోసం కట్టుబడి పని చేస్తారని తెలిపారు ఆర్టీసీ సంస్థ ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నం చేస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని వారన్నారు. గతంలో 55 రోజుల సమ్మె సందర్భంగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా విధానాలు అవలంబిస్తే , 55 రోజుల సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం చేసిన కార్మికుల సత్తా ఏమిటో చాటారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అటువంటి పోరాటాలను శ్రీకారం చుట్టే ఎస్డబ్ల్యుఎఫ్ టీఎంయూ కూటమికే ఆర్టీసీ కార్మికులు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు కార్మికుల పరివారాన్ని మోపి ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రైవేటు సంస్థలకు అప్పచెబుతున్నా విధానాలను స్వస్తి చెప్పాలంటే ఐక్య కూటమి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో కార్మికులకు ఉపయోగ పడే పే స్కేల్ సాధిస్తారని తెలిపారు. సమస్యలు లేని డ్యూటీలు ఉంటాయన్నారు. డిపోల్లో నిరంతరం వస్తున్న సమస్యల పట్ల పోరాటాలు చేస్తారని అన్నారు. ఒక కార్మికుడికి సమస్య వస్తే వారి వెంటే



ఉంటారని కార్మికుడి పై పని భారం పెరిగితే ఆ భారం తగ్గేంత వరకు పోరాటం చేస్తారని, అందుకని రాష్ట్రంలో బాణం గుర్తుకు , రీజియన్ లో నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని వారు తెలియజేశారు. ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ గెలిచిన సందర్భాల్లో ఆర్టీసీ విలీనం పేరుతో అబద్దాలను ప్రచారం చేస్తూ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వ అనుకూలమైనటువంటి విధానాలు ఆలోచించడం వల్ల కార్మిక వర్గం ఈ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని వారు అన్నారు సింగరేణి సంస్థలు సింగరేణి కార్మికులు గెలిపిస్తే వారి హక్కుల సాధన కోసం సొంతింటి కల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయకుండా సింగరేణి యాజమాన్యానికి అనుకూలంగా బొగ్గు బ్లాక్ లను ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను చైతన్యపరిచే ఏ ఒక్క కార్యక్రమాన్ని ఏఐటీయూసీ నాయకత్వం తీసుకోలేదని ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు వివరించారు ఆర్టీసీలో ఎంప్లాయిస్ యూనియన్ గా ఉన్నప్పటికీ కార్మికులకు నేటి వరకు ఒరిగిందేమీ లేదని ఆయన తెలిపారు మోసపూరిత వాగ్దానాలతో వస్తున్న దొంగ నాయకులను బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య. రమేష్, డిపో ాచిఈ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల నాగేశ్వరరావు, ఇస్నాపల్లి శామ్యూల్,ఎచిజ అధ్యక్షులు అనిల్, నందిపాటి రమేష్ ప్రమోద్ రామకృష్ణ షరీఫ్ , శివ నసూర్ రాంబాబు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి : కలెక్టర్ అంకిత్

**○పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి..**

**○విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్07 (జనంసాక్షి):** ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించిన కలెక్టర్, ప పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షలను గమనించి, వారి ప్రశ్నపత్రాలు, ఆన్సర్ షీట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో పాటిస్తున్న విధానం, విద్యార్థుల హాజరు, పరీక్షల సమయంలో తీసు కుంటున్న చర్యలను పరిశీలించి, ప్రధానోపాధ్యా యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఏకలవ్య పాఠశాలలకు ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి పంపిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పాఠశాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. మెడికల్ రూమ్‌లో అందుబాటులో ఉన్న మందులు, విద్యార్థులకు అందించిన చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. వంటకు వినియోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కూరగాయలను నేలపై ఉంచడాన్ని గమనించిన కలెక్టర్, కూరగాయలను నేలపై ఉంచడం వల్ల పురుగులు, క్రిమికీటకాలు చేరి ఆహారం కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కూరగాయలను ర్యాకులు, బండలపై సురక్షితంగా నిల్వ చేయాలని ఆదేశించారు.

కిచెన్ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, ఆహార పదార్థాల తయారీలో తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. వంటకు వినియోగించే కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను శుభ్రంగా కడిగి, నాణ్యతను పరిశీలించిన అనంతరం మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, తాజా కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వంటశాలను ప్రతిరోజూ శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా చూడాలని సూచించారు.స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని క్రమబద్ధంగా నిల్వ చేయాలని ఆదేశించారు. ధాన్యాలు, పప్పులు, కూరగాయలు తదితర వస్తువులను నేలపై ఉంచకుండా ర్యాకులు, బండలపై భద్రపరచాలని, అవసరమైన ఆహార పదార్థాలను మూత ఉన్న డబ్బాలు, కంటైనర్లలో నిల్వ చేయాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమ్‌తో పాటు పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఈ రోజు మెనూలో భాగంగా విద్యార్థులకు తయారు చేస్తున్న చికెన్ కూర నాణ్యతను కూడా కలెక్టర్ పరిశీలించారు. చికెన్ ఎంత పరిమాణంలో వినియోగిస్తున్నారని, ఒక్కో విద్యార్థికి ఎంత పరిమాణంలో అందిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 80 కిలోల చికెన్‌ను వంటకు వినియోగిస్తున్నామని, ఒక్కో విద్యార్థికి సుమారు 120 గ్రాముల చొప్పున అందిస్తున్నామని సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. వంట అనంతరం భోజన నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు సమయానికి, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, ఆరోగ్యకరమైన ఆహారం, అవసరమైన వైద్య సదుపాయాలు అందేలా పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని, పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ములకలపల్లి తాసిల్దార్ స్వాతి బిందు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# వీబీజీ రామ్ జీ పనులు తనిఖీ చేసిన డీఆర్డీవో పీడీ శ్రీరామ్

**నిబంధనలకు అనుగుణంగా ఉపాధి పనులు నిర్వహించాలి**

**జనంసాక్షి, అక్టోబర్ 7, కారేపల్లి (సింగరేణి) :**
వీబీజీ రామ్ జీ పనులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని డీఆర్డీవో పీడీ కే.శ్రీరామ్ అన్నారు. బుధవారం కారేపల్లి మండలం అప్పాయిగూడెంలో వీబీజీ రామ్ జీ క్రింద చేపడుతున్న నిరంతర కాంటూర్ కందకాలు (సీసీటీ) పనులను పీడీ తనిఖీ చేశారు. అప్పాయిగూడెం పాఠశాలలో చేపడుతున్న కమ్యూనిటీ సోక్ పిట్ పనులను పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, పనుల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. పనులు వేగవంత చేయాలని ఆదేశించారు. ఉపాధీ కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, అధికారులు మరియు సిబ్బంది ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పనుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పీడీ శ్రీరామ్ దృష్టికి సర్పంచ్ దండు ప్రవీణ్ తీసుకెళ్లి వాటికి తగిన పరిష్కారాలు చూపించాలని కోరారు. మేట్ల కు సంబంధించిన పేమెంట్‌ను సకాలంలో చెల్లించాలని, అర్హత కలిగి అవసరం ఉన్న కుటుంబాలకు కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. పీడీ వెంట ఏపీడీ లు శ్రీదేవి, చలపతిరావు ఎంపీడీవో పద్మ, సర్పంచ్ దండు ప్రవీణ్, ఏపీవో కోటేశ్వరరావు ఈసీ సుధీర్, కార్యదర్శి కృష్ణవేణి, పాఠశాల హెచ్ఎం సత్యవతి, బీఎఫ్టీ లు వసంత్, రాంబాబు, పార్వతి, మేట్ అజ్మీరా సురేష్, హ్యాండ్ పంపుల మెకానిక్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు పటిష్ట వ్యవస్థ

**ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ పై అవగాహన కలిగి ఉండాలి**

**ఎస్పీ రోహిత్ రాజు..**

**కొత్తగూడెం క్రైమ్ ,అక్టోబర్ 07(జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం నాడు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) మరియు ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ (పిఓఎస్హెచ్) చట్టంపై మహిళా పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ కీలక బాధ్యతలు చేపడుతున్నారని తెలిపారు. విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) ద్వారా నిర్భయంగా తెలియజేయాలని సూచించారు.పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పిఓఎస్హెచ్ చట్టం? 2013 నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళా ఉద్యోగుల గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి కూడా తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖలో ప్రతి మహిళా ఉద్యోగి ఆత్మవిశ్వాసంతో, భద్రతతో విధులు నిర్వహించేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా మహిళ పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండాలని సూచించారు. ఆధునిక పోలీసింగ్‌లో కీలకంగా ఉపయోగిస్తున్న నాట్ గ్రిడ్, గాండీవ, సహాయోగ్ తదితర వెబ్ అప్లికేషన్లపై అవగాహన పెంపొందించు కుని, వాటిని విధి నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసింగ్‌ను మరింత ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యు నాయక్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అధికారులు సీఐ శ్రీలక్ష్మి, సిఐ రాము, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, డిస్ట్రిక్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జ్ ఎస్సై శ్రీనివాస్, షీటీమ్ ఎస్సై రమాదేవి, జిల్లాలోని మహిళ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రామన్నపేటలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ తీరుకు నిరసన

### దిష్టిబొమ్మ దగ్ధం చేసిన యువజన కాంగ్రెస్

**రామన్నపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి ):**

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అవలంబిస్తున్న ధోరణిని నిరసిస్తూ రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో యువజన కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ తక్షణమే జ్ఞానేష్ కుమార్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తూ దేశంలో దాదాపు 14 కోట్ల ఓట్లను ఎలాంటి అభ్యంతరాలు లేకుండా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ అక్రమ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహిస్తోందని అన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ ఆదేశాల మేరకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను అరెస్ట్ చేయాలని, లేనిచో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్, మండల ఉపాధ్యక్షులు కేస సాయి, పట్టణ అధ్యక్షులు జవ్వాజి శ్రీకాంత్, కొమ్మయిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల పరుశురాం, ఇస్కిల్ల గ్రామ శాఖ అధ్యక్షులు బందెల వినయ్, పట్టణ కార్యదర్శి కామిటికారి సాయి వెంకట్, సుర్వి మచ్చగిరి, సుర్వి రాకేష్, పాషా, సింగరాయబోయిన అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య

**నూతనకల్ అక్టోబర్ 7( జనంసాక్షి)**



నూతనకల్ మండల కేంద్రము లో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 2023 లోపు ఉత్తీర్ణులై డిగ్రీ, డిప్లొమా, గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు చేసుకొని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతు తెలిపి,అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు నకిరకంటి వెంకన్న, జహంగీర్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్ల సైదులు యాదవ్ మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగుతల సోమయ్య,కందుకూరి శ్రీకాంత్, మడ్డి లింగయ్య, బాణాల కిరణ్ రెడ్డి, సామ ఉపేందర్ రెడ్డి,లతీఫ్,బొల్లేద్దు నాగయ్య, దేవరకొండ సాయి, భాను,కారింగుల రవి తదితరులు పాల్గొన్నారు.

## టీజెఎస్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులుగా ధర్మార్జున్ నియామకం

**సూర్యాపేట (జనంసాక్షి):**



తెలంగాణ జన సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులుగా సూర్యాపేట చెందిన న్యాయవాది సీనియర్ తెలంగాణ జన సమితి నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు కుంట్ల ధర్మార్జున్ ను నియమిస్తూ తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఉత్తర్వులు జారీ చేశారు విప్లవ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ప్రయాణం మొదలెట్టి విప్లవోద్యమ నాయకుడిగా ఎదిగి పౌర ప్రజాస్వామ్య ఉద్యమంలో క్రియాశీలకంగా కొనసాగిన ధర్మార్జున్ తదుపరి మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక డివిజన్ కమిటీ స్థాయి నుండి రాష్ట్ర కార్యదర్శి వరకు ఎదిగారు.తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భావ సభ్యుడిగా కొనసాగుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జిగా పార్టీ పలు అంతర్గత కమిటీలకు బాధ్యుడిగా వ్యవహరిస్తూ ఉన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర ప్లీనరీ నిర్ణయం మేరకు కొత్త కమిటీని ప్రకటించిన కోదండరాం మొదట నుండి తనకు తోడుగా వెన్నుదన్నుగా ఉన్న ధర్మార్జున్ ను సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ తనను రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియమించిన ప్రొఫెసర్ కోదండరాంకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం, అమరవీరుల, ఉద్యమ ఆకాంక్షల సాధన కొరకు ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కొరకు నిరంతరం ప్రజా ఉద్యమాలతో మమేకమవుతూ ముందుకు సాగుతానని అన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వసతిగృహానికి రూ.50 వేల విరాళం

**భద్రాచలం అక్టోబరు 07 (జనంసాక్షి)**



భద్రాచలం పట్టణంలోని గోల్డ్‌స్మిత్ కాలనీలో వేంచేసియున్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పూజారి వసతిగృహానికి విరాళాలు అందజేస్తున్నారు. వీఆర్‌కే స్టీల్ ఇండస్ట్రీస్ చైర్మన్ బ్రహ్మశ్రీ పెంటా శ్రీనివాస్ విశ్వకర్మ, శ్రీమతి విజయభాను దంపతులు తమ జ్యేష్ఠ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా గతంలో ప్రకటించిన విధంగా రూ.50 వేల చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ అనుగోజు నాగభూషణంకు స్వామివారి సన్నిధిలో అందజేశారు. అనంతరం విరాళానికి సంబంధించిన రశీదును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, అర్చకులు బ్రహ్మశ్రీ ముగడా హరినాథ్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శ్రీనివాస్ దంపతులతో పాటు వచ్చిన వెస్కో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ బంగారు తాతారావు దంపతులను ఆలయ కమిటీ తరపున శాలువాలతో సత్కరించారు. అనంతరం అతిథులకు భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామివారి దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలు సమర్పించారు. వారి కోరిక మేరకు పర్ణశాల, చిన్న అరుణాచలం ఆలయాలను కూడా దర్శింపజేశారు. చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ శివ నాగరాజు చేతుల మీదుగా దంపతులకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అరిటికట్ల రాము, కడార్ల రాము, బొద్దోజు శ్రీను, వెల్పుకొండ సతీష్, కోశాధికారి ఆలేటి నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు. ఆలయ వసతిగృహ నిర్మాణాన్ని ప్రారంభం నుంచి బాధ్యతగా తీసుకుని నిధుల సేకరణలో కృషి చేస్తున్న బులియన్ మర్చంట్స్ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి దార్ల బ్రహ్మానందాచార్య, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అనుగోజు నరసింహాచారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ వసతిగృహ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## మిత్రుడి కుటుంబానికి అండగా.. ఆపదలో ఆర్థిక చేయూత

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి అక్టోబర్ (07)**

ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన దిగోజు నాగరాజు కుటుంబానికి ఆయన రాఅ 2008?09 బ్యాచ్ మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. మిత్రత్వానికి ప్రతీకగా తమ వంతు సహాయాన్ని అందించి, నాగరాజు కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా నాగ రాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. మహేష్, వి. చంద్రశేఖర్, ఏ. నరేష్, బి. లక్ష్మారెడ్డి తదితర రాఅ 2008?09 బ్యాచ్ మిత్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్లు, సాక్సులు, బెల్టుల పంపిణీ

**చిలుకూరు, అక్టోబర్ 07(జనంసాక్షి):**

మండలంలోని కొండాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బూట్లు సాక్సులు బెల్టులను గ్రామ సర్పంచ్ కత్తి బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠశాల సామగ్రిని అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాఠశాలకు హాజరవుతూ చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తమవంతు సహకారం అందించాలని కోరారు.విద్యార్థులకు బూట్లు, సాక్సులు, బెల్టులు అందడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అవసరాల విషయంలో తల్లి దండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు సురగాని లింగయ్య, ఒరుగంటి నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం, పౌష్టిక ఆహారం తీసుకోవాలి : ఎంపీడీవో సునీత

**నూతనకల్ అక్టోబర్ 7( జనంసాక్షి)**

మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణి మహిళలకు సామూహిక శ్రీమంతాలు చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత పాల్గొని గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారాన్ని అందించి సామూహిక శ్రీమంతాలను చేశారు. అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు ముందస్తు బతుకమ్మలను రకరకాల పూలతో పేర్చి బతుకమ్మ పాటలతో నృత్యాలు చేశారు. 9వ పోషణ మాసం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు వారోత్సవాల లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో పాల్గొన్నవారు సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు గర్భిణీ స్త్రీలు తదితరులు ఉన్నారు.

## వయోజన విద్యతోనే జీవితానికి వెలుగు అదనపు ఎస్పీ రమేష్

**మాడుగులపల్లి అక్టోబర్ 7 (జనంసాక్షి):**





చదువుకు వయసుతో సంబంధం లేదని, విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని నల్గొండ జిల్లా అదనపు ఎస్పీ రమేష్ అన్నారు మంగళవారం రాత్రి మాడుగులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో శాస్త్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సేవా భారత్ సహకారంతో ఏర్పాటు చేసిన వయోజన విద్యా కేంద్రాన్ని మిర్యాలగూడ డీఎస్పీ జి.రవితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు శాస్త్రి ఫౌండేషన్ చైర్మన్ తీగల జాన్ శాస్త్రి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ చదువుకోవడం వల్ల స్వతంత్రంగా జీవించడమే కాకుండా మోసపోకుండా ఉండవచ్చని తెలిపారు పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే పెద్దలు కూడా చదువుకోవాలని పిలుపునిచ్చారు ఈ కేంద్రంలో సుమారు 80 మంది నిరక్షరాస్యులు పేర్లు నమోదు చేసుకోగా, ఏడాది పాటు విద్యనందిస్తామని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో తోపుచర్ల సర్పంచ్ నన్నేబోయిన పార్వతి రమేష్, ఉపసర్పంచ్ వల్లెపు నరేష్, వార్డు మెంబెర్ వల్లపుదాసు మానస, విద్యా వాలంటీర్లు మిసాల నాగేందర్, బొప్పని వీరయ్య, సతీష్, ఉపేందర్, అశ్విని, కరుణాకర్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# తల్లులు పిల్లలకు సెల్ ఫోన్ అలవాటు చేయొద్దు:ఎం ఎల్ ఏ రాగమయి

## సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు చేసిన ఎంఎల్ఏ

**పెనుబల్లి, అక్టోబర్ 7(జనంసాక్షి)**

తల్లులు తమ పిల్లలకు సెల్ ఫోన్ అలవాటు చేయొద్దని తల్లులకు సత్తుపల్లి ఎంఎల్ఏ శ్రీమతి మట్టా రాగమయి దయానంద్ హితవు పలికారు. బుధవారం పెనుబల్లి మండలం వి ఎం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల ఆధ్వర్యం లో పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రాగమయి మాట్లాడుతూ పిల్లలలో సెల్ ఫోన్ వాడకం ద్వారా మానసిక, శారీరక ఎదుగుదల తగ్గిపోతుందని ఆమె తల్లులకు సూచించారు, పిల్లలుచేసే మారాము ఆపడానికి, ఆహారం తినడానికి తల్లులు తమ పిల్లలకు సెల్ ఫోన్ ఇస్తున్నారని, ఇది మంచి అలవాటు కాదని అన్నారు, బాలింతలు పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న



సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత పై గ్రామీణ ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని అంగనవాడి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎం ఎల్ ఏ గర్భిణీలకు సామూహిక సీమంతాలు, పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు, ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారులు,అంగన్వాడి సిబ్బంది, తల్లులు ఎమ్మెల్యేని శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐసిడిఎస్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమికి జైకొట్టండి

## నక్షత్రం, బాణం గుర్తులపై ఓటేసి గెలిపించాలని విస్తృత ప్రచారం

**భద్రాచలం అక్టోబర్ 07 (జనంసాక్షి)**

ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్, టీడబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఐక్య సంఘాల నాయకులు బుధవారం ఉదయం ఆర్టీసీ డిపోలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నక్షత్రం, బాణం గుర్తులపై ఓట్లు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కార్మికులను కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు ఆర్టీసీ విలీన ప్రక్రియ సజావుగా సాగాలంటే ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించడం అవసరమని నాయకులు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడే సంఘాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎంపీ నర్సారెడ్డి, వై.వెంకట్‌రామారావు, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఐక్య కూటమి నాయకులు జే.ఆర్.బాబు, బి.బాలకృష్ణ, జి.యుగంధర్, కే.యాకయ్య, ఐ.వి.బాబు, వి.ఎన్.రావు, కేకే.ప్రసాద్, కే.ప్రతాప్, డీఎన్.రావు, సీహెచ్.కవిత, డి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## గిరిజన సంఘం రాష్ట్ర నాయకులుబాధావత్ శ్రీను పిలుపు



**కామేపల్లి,అక్టోబర్ 7 (జనం సాక్షి):**

అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద లోని సంతోష్‌నగర్‌లో నిర్వహించ నున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను గిరిజనులంతా పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు బాధావత్ శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం కామేపల్లి మండలం రేపల్లెవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా బాధావత్ శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజన జనాభా అధికంగా ఉన్నప్పటికీ,వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో చేరడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి పథకాలను పక్కాగా అమలు చేయాలని కోరారు.ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన గిరిజన యోధుడు ౠను నాయక్ స్మారకార్థం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని విజ్ఞప్తి చేశారు. పాలనా సౌలభ్యం, గిరిజన ప్రాంతాల శీఘ్రగతిన అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో 'ఐటీడీఏ' కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో వ్యవహరించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి, మూల ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



# కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

## కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవంలో వక్తల పిలుపు

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 7(జనంసాక్షి):**

దేశంలో కులం పేరుతో కొనసాగుతున్న వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలను నిర్మూలించి సమానత్వ సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు పాపిట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డు సర్కిల్‌లో బుధవారం కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు తమ్మినేని వెంకట్రావు కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం మండల ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో పాపిట్ల సత్యనారాయణ, తమ్మినేని వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. కుల వివక్షను ప్రశ్నించిన దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం వల్ల రిజర్వేషన్ల ప్రయోజనాలు దళిత, వెనుకబడిన వర్గాలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేయాల్సింది పోయి వాటిని నిర్వీర్యం చేసే చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని భూములపై సమగ్ర విచారణ చేపట్టి మిగులు భూములను గుర్తించి దళిత పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకట్రావు మాట్లాడుతూ దళితుల హక్కులు కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. గ్రామాలు, పట్టణాల్లో రూపం మార్చుకుని కుల వివక్ష కొనసాగుతోందన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు నిరంతర ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేవీపీఎస్ ఏర్పడిన తొలినాళ్లలో వేలాది గ్రామాల్లో సర్వే నిర్వహించి 63 రకాల కుల వివక్షలను గుర్తించిందని, వాటి నిర్మూలన కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నందిగామ కృష్ణ, కొప్పుల ఉపేందర్, నూకల బాలరాజు, మల్లెబోయిన రాజశేఖర్, పగిడిపల్లి ఉపేందర్, ఏటుకూరి ప్రసాదరావు, పోతురాజు తిరపయ్య, మడిపల్లి వెంకన్న, గుంటి వెంకన్న, కస్తాల ఆంటోనీ, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకర ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారం.. సర్పంచ్ కృషి**

**తుర్కపల్లి, అక్టోబర్ 7 (జనంసాక్షి):**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ కృషికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారం అందించారు.మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా గ్రామంలో పర్యటించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు గ్రామస్థులు ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ప్రమాదకర ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.దీంతో విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులు చేపట్టడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న 11 ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఏఈ బిక్షపతికి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఇనుప స్తంభాల సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# గిరిజన మ్యూజియంలో ఇల్లందు విద్యార్థులకు చరిత్ర పాఠాలు

## గిరిజన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలపై ప్రత్యక్ష అవగాహన

**భద్రాచలం అక్టోబరు 07 (జనంసాక్షి)**

పుస్తకాల్లో చదివిన చరిత్రను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు లభించింది. కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో చరిత్ర సహాయ ఆచార్యులు డాక్టర్ జి. శేఖర్ నేతృత్వంలో విద్యార్థులు భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణం లోని గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి విద్యార్థులకు గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, వ్యవసాయ పద్ధతులు, పండుగలు, జాతరలు, ఆచారాలు, విశ్వాసాలు తదితర అంశాలను వివరించారు. గిరిజనులు స్థానికంగా లభించే సహజ వనరులతో తయారు చేసుకున్న గృహోపకరణాలు, వ్యవసాయ పనిముట్లు, వేట పరికరాలు, ఆభరణాలు, సంప్రదాయ వస్తువులను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. గిరిజనులు వినియోగించే




సంప్రదాయ సంగీత వాయిద్యాలను చూపిస్తూ పండుగలు, జాతరలు, వివాహాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో వాటి ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు మ్యూజియంలోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ పలు అంశాల పై ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసు కున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. శేఖర్ మాట్లాడుతూ పుస్తకాల్లో చరిత్రను చదవడంతో పాటు ప్రత్యక్ష ఆధారాలను పరిశీలించడం వల్ల విద్యార్థుల్లో చారిత్రక అవగాహన మరింత పెరుగుతుందని అన్నారు. ఇలాంటి క్షేత్ర పర్యటనలు పరిశీలనా నైపుణ్యం, పరిశోధనా ఆసక్తి, సామాజిక అవగాహనను పెంపొందిస్తా యని పేర్కొన్నారు. మ్యూజియం సిబ్బంది మాధవితో పాటు విద్యార్థులు నందిని, స్రవంతి, మహేశ్వరి, మానస, నవ్య, సుజాత సౌందర్య, రోజా, హేమలత, రష్మిత, తేజశ్రీ, ప్రవళిక, వైష్ణవి మీనా తదితరులు పాల్గొన్నారు.

# వైరా అభివృద్ధికి భారీగా నిధులు.. పనులకు సన్నాహాలు

- వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.85 కోట్ల నిధులు
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భారీగా నిధులు
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి 7.4 కోట్లు మంజూరి:ఏఈ శ్రీమన్య



**వైరా జనంసాక్షి**
అక్టోబర్ 7న వైరా మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని మున్సిపల్ ఏఈ శ్రీమన్య తెలిపారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటుకు రూ.7.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుందని ఆమె వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి మంజూరైన రూ.7.85 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం పనులను దశలవారీగా ప్రారంభిస్తామని తెలిపారు.

**షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.7.04 కోట్లు**
వైరా మున్సిపాలిటీ పరిధిలో రింగ్‌రోడ్డు వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూడా రూ.7.04 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఏఈ శ్రీమన్య తెలిపారు. త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరగడంతో పాటు వ్యాపారులకు కూడా సౌకర్యం కలగనుందని తెలిపారు.

**అమృత పథకంతో తాగునీటి సమస్యకు పరిష్కారం**
అదేవిధంగా వైరా మున్సిపాలిటీలో అమృత పథకం కింద రూ.26.87 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈ నిధులతో తాగునీటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నీటి ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఏఈ శ్రీమన్య వెల్లడించారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

**చంద్రుగొండ, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
చంద్రుగొండ అంబేద్కర్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో జాయ్ స్మైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ఆసిఫ్ ఆర్థిక సహకారంతో 20 మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్స్, ఎక్కాల పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉపాధ్యాయ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దాసరి మణి, కార్యదర్శి ప్రశాంత్ చేతుల మీదుగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంజా రామకృష్ణ మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితుడు మహమ్మద్ ఆసిఫ్ తన చిన్ననాటి ఇబ్బందులను గుర్తుచేసుకుని విద్యార్థులకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ రుక్మిణి ఫౌండేషన్ నిర్వాహకులను, సహకరించిన మహమ్మద్ ఆసిఫ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర రావు, విజయ, కృష్ణవేణి, రామకృష్ణ, లాజరస్, నాగరాజు, మణి, తిరుపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.






## ప్రధాని, హోంమంత్రి రాజీనామా చేయాలి

**చంద్రుగొండ, అక్టోబర్ 7 (జనంసాక్షి):**
ఎన్నికల సంఘం వ్యవహారాలపై నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రధానమంత్రి, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని న్యూ డెమోక్రసీ నాయకులు ఎస్కే ఉమర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు కారం వెంకటేశ్వర్లు, తేజావత్ భీముడు, టి. మనోజ్, ఎం.డి. జరీనా, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూతో వివాహిత మృతి

**హైమావతి పార్వతి దేహానికి నివాళులర్పించిన పలువురు నేతలు**

**తిరుమలాయపాలెం అక్టోబర్ 7( జనంసాక్షి)**



డెంగ్యూ జ్వరంతో వివాహిత మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పిండిప్రోలు గ్రామపంచాయతీ శివారు పాపాయిగూడెం గ్రామానికి చెందిన ఏలూరి సిద్దారావు సతీమణి ఏలూరి హైమావతి 40 సంవత్సరాలు గత కొంతకాలం నుండి ఖమ్మంలో నివాసం ఉంటున్నారు ఇటీవల జ్వరం రావడంతో హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చేర్పించగా డెంగ్యూ జ్వరం నిర్ధారణ కావడంతో వైద్య సికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు మృతురాలకు ఇద్దరు కుమార్తెలు జనని, శరణ్య భర్త సిద్దారావు కలరు మృతి వార్త తెలుసుకున్న పిండిప్రోలు మాజీ సర్పంచ్ నామ ప్రసాద్ గ్రామ ఉప సర్పంచ్ చామకూరి రాజ్ కుమార్ టి యు డబ్ల్యు జె ఐ జె యు జిల్లా నాయకులు పప్పుల శ్రీనివాసరావు మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏలూరు ఆనందరావు మండల ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గాదరి బాబు చామకూరి రమేష్ తాత రవీందర్ జాల ఉమేష్ జాల కిరణ్ తదితరులు హైమావతి పార్వతి దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.

# బోర్డులపై గ్రీన్.. బోర్లలో డ్రై..

- పేరుకే హరితహారం కనిపించని పచ్చదనం..
- నాటిన చోటే వచ్చే ఏడాది అదే చోట మొక్కలు నాటిన వైనం..
- ప్రభుత్వ కార్యాలయంలో కనిపించని పచ్చదనం..
- ఇంకుడు గుంతల పేరిట కోట్ల నిధులు వృథా

**మణుగూరు, అక్టోబర్ 07 (జనంసాక్షి):**
భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్‌నినో' ప్రభావం నేడు మన ముంగిట నిప్పుల కొలిమిని సృష్టిస్తోంది. మణుగూరులో మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరడం, వర్షాలు మొహం చాటేయడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం ఒక తీవ్రమైన సంక్షోభానికి స్పష్టమైన సంకేతాలు. వాతావరణ మార్పుల రూపంలో ప్రకృతి మనకు ఎప్పటికప్పుడు గట్టి హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. కానీ, అటు పాలకులు, ఇటు ప్రజలు ఆ హెచ్చరికలను పెడచెవిన పెడుతూ నిర్లక్ష్యపు నిద్రలో జోగుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కేవలం ఎండలే కాదు, నీటి చుక్క కోసం అల్లాడే భయానక క్షామం తప్పదు! ఎవరికి వారు నాకెందుకులే అనుకుంటే తాగటానికి నీరులేక తినటానికి తిండిలేక కరువు కాటకాలతో ప్రజలు విలవిలలాడే ప్రతి ఇంటా మృత్యు ఘోష వినిపిస్తోంది. తేలికగా తీసుకుంటే ఇంతకు మించి ఇబ్బందులు ఎదురుకోక తప్పదని నిపుణులు చెబుతున్నారు.

**పబ్లిసిటీకే పరిమితమైన హరితహారం:**
ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో చెట్లు నాటడం, ఇంకుడు గుంతలు తీయడం అనేవి పర్యావరణ పరిరక్షణకు అద్భుతమైన మార్గాలు. కానీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరు చూస్తుంటే ఇది కేవలం ఒక వార్షిక ఉత్సవంగా, అధికారుల పబ్లిసిటీ స్టంట్‌గా మారిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఈ పనులను ఎంత నిర్లక్ష్యంగా చేస్తోందో చెప్పడానికి కింది వాస్తవాలే నిదర్శనం. నాటిన చోటే సమాధి ప్రతి ఏటా పర్యావరణ దినోత్సవాలకో, ప్రజాప్రతినిధుల పుట్టినరోజులకో ప్రభుత్వ కార్యాలయాల ముందు అధికారులు కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటుతారు. ఆ సమయంలో కెమెరాలకు ఇచ్చే ఫోజులు, సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ఉన్న శ్రద్ధ... ఆ తర్వాత ఆ మొక్కకు నీళ్లు పోయడంపై ఉండదు. నాటిన వంద మొక్కల్లో కనీసం ఐదు కూడా బతకని దుస్థితి. మరుసటి ఏడాది అదే గుంతలో, అదే అధికారి మళ్లీ కొత్త మొక్క నాటడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రజాధనం ఇలా మొక్కల కొనుగోలు పేరుతో బూడిదలో పోసిన పన్నీరవుతోంది.









**నిధుల దుర్వినియోగం:**
భూగర్భ జలాలను పెంచడానికి ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రామాల్లో నిర్మించే ఇంకుడు గుంతలు సాంకేతిక ప్రమాణాల ప్రకారం ఉండటం లేదు. కేవలం నిధులు డ్రా చేసుకోవడానికి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడానికి మాత్రమే ఇవి ఉపయోగపడుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని రోజుల్లోనే ఈ ఇంకుడు గుంతలు ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసే చెత్తకుండీ,ఇక ఆఫీసులో ఉండే ఇంకుడు గుంతలు ఫైళ్లు, చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకడం పక్కన పెడితే, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి సిబ్బంది ఆరోగ్యానికే ఎసరు పెడుతున్నాయి. కొన్ని చోట్ల ఇవి తెరిచి ఉంచి, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్నాయి.



ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా కాగితపు లెక్కలు, సామాజిక మాధ్యమాల ప్రచార ఆర్భాటాలు పక్కనపెట్టి... తాము పనిచేసే కార్యాలయాలను ఆదర్శవంతమైన పర్యావరణ కేంద్రాలుగా మార్చాలి. అప్పుడే ప్రజల్లో కూడా మార్పు వస్తుంది.

**అధికారుల నిర్లక్ష్యం:**
గ్రామాల్లో ఎండలకు చెరువులు, బావులు ఎండిపోయి పంటలు పండక రైతులు అల్లాడుతున్నారు. కానీ అధికారుల్లో ఎలాంటి స్పందన లేకుండా పోయింది. గ్రామాలు పట్టణాల్లో రోడ్ల విస్తరణ లో భాగంగా చెట్లు నరికి మళ్లీ నాటడం మరిచారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రహదారుల వెంట మొక్కలు నాటడం మరిచారు. ఇంకుడు గుంతల పేరిట లక్షల రూపాయల బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. ఆ గుంతలు చూస్తే సరిగ్గా తవ్వరు, వర్షం వస్తే నీళ్లు లోపలికి పోవు. కేవలం కాంట్రాక్టర్లకు, అధికారులకు కమిషన్ల కోసమే ఈ పనులు చేస్తున్నట్లు ఉంది తప్ప, భూగర్భ జలాలు పెంచాలనే చిత్తశుద్ధి ఎక్కడా కనిపించడం లేదు."

**-బీజేపీ నాయకులు రమేష్**

# అశ్వారావుపేటలో నూతన షటిల్ కోర్టు ప్రారంభం

## ఎమ్మెల్యేలు జారే, రాగమయి చేతుల మీదుగా ప్రారంభం



**అశ్వారావుపేట అక్టోబర్ 07(జనంసాక్షి):** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాల చెరువు రోడ్డులో డాక్టర్ బాబురావు స్థలంలో నూతనంగా నిర్మించిన షటిల్ కోర్టును అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కోర్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను ఎమ్మెల్యేలు అభినందించారు, యువత క్రీడల వైపు ఆకర్షితులై శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ఇటువంటి క్రీడా వేదికలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులను పెంపొందించాల్సిన అవసరం ఉందని, చదువుతో పాటు క్రీడలకు కూడా యువత ప్రాధాన్యత ఇవ్వాలని వారు పేర్కొన్నారని, అశ్వారావుపేట నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే నియోజకవర్గంలో వివిధ క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు, షటిల్ కోర్టు నిర్మాణానికి స్థలం సమకూర్చిన డాక్టర్ బాబురావును అభినందించారు, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, యువత పాల్గొన్నారు.



# ప్రైవేట్ కాలేజీ పై అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్,7 (జనంసాక్షి)**

ఫీజులు చెల్లించినా ట్రాన్స్ ఫర్ సర్టిఫికేట్ ఇవ్వకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ వేధిస్తున్నారని ఓ విద్యార్థిని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. ఖమ్మం పట్టణానికి చెందిన దాసరి దీపిక తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... తాను 2021వ సంవత్సరంలో ఖమ్మంలోని పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కాలేజీలో జాయిన్ అయ్యింది. మొదటి సంవత్సరం ఫీజు పూర్తిగా చెల్లించింది. అయితే రెండవ సంవత్సరంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేసింది చదువు మానేసినప్పటికీ కాలేజీ యాజమాన్యం తన ఒరిజినల్ సర్టిఫికేట్లు – టెన్త్, ఇంటర్ మెమోలు, టీసీ ఇవ్వకుండా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. 4వ సెమిస్టర్ నుండి 5వ సెమిస్టర్ వరకు ఫీజుతో పాటు పెనాల్టీ కట్టాలని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపింది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఫీజు కట్టలేకపోతున్నానని, తన సర్టిఫికేట్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినితో పాటు పడిశాల మధుసూదన్ రావు , ఎస్.కె. మస్తాన్ .దుమాల నాగరాజు ఖమ్మం ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి. తదితరులు పాల్గొన్నారు.

# మధిర డిపోలో హోరాహోరీ ప్రచారం

## ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలకు సమయం సమీపించడంతో వేడెక్కిన పోరు




**మధిర, అక్టోబర్ 07 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికలకు సమయం సమీపించడంతో మధిర డిపోలో ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈ నెల 9న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాల కూటములు తమ అభ్యర్థులు, గుర్తుల గురించి కార్మికులకు వివరిస్తూ ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నాయి. డిపోలో మొత్తం 188 మంది ఓటర్లు ఉండటంతో ప్రతి ఓటు కీలకంగా మారింది. ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కలిసి జేఏసీ కూటమిగా ఎన్నికల బరిలో నిలిచాయి. రాష్ట్రస్థాయి గుర్తింపు కోసం మూడో క్లాజ్‌లో బస్సు గుర్తుపై ఎంప్లాయీస్ యూనియన్ పోటీ చేస్తుండగా, ఖమ్మం, వరంగల్ ప్రాంతీయ గుర్తింపు కోసం ఆరో క్లాజ్‌లో కాగడా గుర్తుపై నేషనల్ మజ్దూర్ యూనియన్ పోటీ చేస్తోంది.
అదే విధంగా తెలంగాణ వర్కర్స్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కలిసి జేఏసీయేతర కూటమిగా పోటీలో ఉన్నాయి. రాష్ట్రస్థాయి గుర్తింపు కోసం మూడో క్లాజ్‌లో బాణం గుర్తుపై, ఖమ్మం, నల్గొండ ప్రాంతీయ గుర్తింపు కోసం ఆరో క్లాజ్‌లో నక్షత్రం గుర్తుపై పోటీ చేస్తున్నాయి.
ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు కూటముల నాయకులు కార్మికులను కలిసి తమ సంఘాల విధానాలు, సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాలను వివరిస్తున్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం తదితర అంశాలు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్నాయి. దీంతో మధిర డిపోలో ఎన్నికల వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఈ నెల 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో చివరి దశ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసేందుకు కూటములు సిద్ధమవుతున్నాయి. గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వివిధ యూనియన్ నాయకులు లోకల్ స్పాట్ కి తెలిపారు.

# ఏరియా ఆసుపత్రికి రూ.5 లక్షల పరికరాలు



**అశ్వారావుపేట అక్టోబర్ 7 (జనం సాక్షి):** రెండు రాష్ట్రాల పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ నిధులతో రూ.5 లక్షల విలువ గల వైద్య పరికరాలను అందించామని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తెలిపారు, బుధవారం ఏరియా ఆసుపత్రిలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇన్ పేషెంట్ వార్డును ప్రారంభించిన అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధా రుక్మిణికి దంత వైద్య కుర్చీలు, మంచాలు, ప్రాణవాయువు సిలిండర్లు, పేషెంట్ డాప్లర్లు తదితర పరికరాలను అందజేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామని, పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, మారుమూల గిరిజన గ్రామాల నుండి వచ్చే గిరిజనులకు వైద్యులు స్థానికంగా ఉండి సేవలు అందించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సైదులు,. ఆర్ఎంఓ మౌనిక, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జెర్రిపోతులగూడెంలో ఉచిత కంటి పరీక్షలు

**చిలుకూరు,అక్టోబర్ 07 (జనం సాక్షి):**

గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా
గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలు, ఇతర కంటి సంబంధిత ఇబ్బందులను పరీక్షించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ గుగులోత్ లలిత మాట్లాడుతూ ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్ నిర్మల,లయన్స్ క్లబ్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7(జనం సాక్షి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డై హౌస్ ప్రాంగణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగూరి పాండు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, 9వ వార్డు కౌన్సిలర్ జినుకాల లావణ్య యాదగిరి ముదిరాజ్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని కనుముక్కల, వంకమామిడి, ధర్మారెడ్డి పల్లి గ్రామాల్లో కూడా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతల వెంకటేష్ యాదవ్, సర్పంచులు చుక్క శుభాశంకర్, మచ్చ శ్రీనివాస్, సామ రవీందర్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడమటి మహిపాల్‌రెడ్డి, కొమురె కిరణ్, పీఏసీఎస్ డైరెక్టర్ చెక్క వెంకటేష్, మండల నాయకులు బద్దం రాజేశ్వర్, మాజీ సర్పంచ్ బుడిగె శంకరయ్య, నాయకులు జంగయ్య, కాసుల బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై హమాలీల బోనస్, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

## జాయింట్ కలెక్టర్‌ను కోరిన నాగండ్ల దీపక్ చౌదరి



**ఖమ్మం, (జనంసాక్షి) :** సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరుతూ ఖమ్మం అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగర ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీ కార్మికుల ప్రతినిధులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా హమాలీ కార్మికులకు పండుగ బోనస్ అందించడంతో పాటు ప్రతి కార్మికుడికి పీఎఫ్ నంబర్ సౌకర్యం కల్పించాలని నాగండ్ల దీపక్ చౌదరి కోరారు. ఏళ్లుగా సివిల్ సప్లై గోదాముల్లో హమాలీలుగా పనిచేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థకు తమ శ్రమను అందిస్తున్న కార్మికులకు పండుగ సమయంలో బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే కార్మికుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని పీఎఫ్ సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ కార్మికుల అధ్యక్షులు అంజిరెడ్డి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తుందని నగర ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు తెలిపారు. హమాలీలకు పండుగ బోనస్, పీఎఫ్ సౌకర్యం కల్పించే వరకు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, సివిల్ సప్లై హమాలీ కార్మికుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.